క్లుప్తంగా

స్వచ్ఛందంగా వలంటీర్ పోస్టుకు రాజీనామా

నెహ్రూనగర్: ప్రతి నెల అవ్వతాతల ఇంటికి వెళ్లి అందజేసే పెన్షన్‌ను ఈ నెల నుంచి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇవ్వవద్దని సచివాలయ సెక్రటరీలు ఆదేశాలు జారీ చేయడం .. సీఎం వైఎస్ జగన్ చేసే కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయకూడదని చెప్పడంతో 54వ డివిజన్ పరిధిలోని దాసరిపల్లి విక్టర్ స్వచ్ఛందంగా వలంటీర్ పోస్టుకు రాజీనామా చేశారు. ప్రభుత్వం చేసే మంచి కార్యక్రమాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, తిరిగి రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తేనే పేదలకు సేవ చేసే భాగ్యం నాకు ఉంటుందనే ఉద్దేశంతోనే స్వచ్ఛందంగా వలంటీర్ పోస్టుకు రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం తన కృషి చేస్తానని విక్టర్ ప్రకటించాడు.

కేర్‌వెల్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఇఫ్తార్



గుంటూరు మెడికల్: కేర్ వెల్ సూపర్ స్పెషాలిటీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక నల్లపాడురోడ్డులోని శ్రీరామ్‌నగర్‌లో రంజాన్ మాసం పురస్కరించుకుని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ షేక్ నాగూర్‌బాషా ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. విందులో గుంటూరు నగరంలోని పలు ఆసుపత్రులకు చెందిన వైద్యులు, వైద్య సిబ్బంది, ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలు పాల్గొన్నారు. పలువురు ముస్లిం మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ నాగూర్‌బాషా మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందు, జకాత్ లాంటివి చేయడం పుణ్యకార్యమన్నారు. ముస్లింలు 30 రోజులపాటు ఉపవాస దీక్ష చేపడతరన్నారు. దీక్ష చేపట్టిన వారికి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం పుణ్యకార్యమన్నారు. హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ గౌస్‌బాషా, హాజీ షేక్ మస్తాన్‌వలి, షేక్ అర్షిత్ పటేల్, కార్డియాలజిస్ట్ డాక్టర్ శివశంకర్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ నరేంద్రరెడ్డి, జనరల్ సర్జన్ డాక్టర్ హర్షవర్ధన్, నెఫ్రాలజిస్టు డాక్టర్ మొహమ్మద్ అస్లాం, తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై భార్య ఫిర్యాదు

నగరంపాలెం: కానిస్టేబుల్ పై అతని భార్య జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో ఫిర్యాదు చేసింది. తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన ఎం.భారతికి గుంటూరు పరిధిలోని ఓ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించే కానిస్టేబుల్‌తో 15 ఏళ్ల క్రితం పెళ్లయింది. వీరిద్దరూ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఈ క్రమంలో కుటుంబంలో కలతలు తలెత్తగా, కేసు కోర్టులో నడుస్తోంది. అయితే సదరు కానిస్టేబుల్ మరొకరిని వివాహం చేసుకుని, కాపురం చేస్తున్నట్లు బాధితురాలు సోమవారం డీపీఓ పోలీస్ ఉన్నతాధికారి దృష్టికి తీసుకువచ్చారు. తనకు న్యాయం చేయాలని ఆమె ఫిర్యాదులో వేడుకుంది.

మతిస్థిమితం లేని బాలిక అదృశ్యం

గుంటూరు ఈస్ట్: బాలిక కనిపించకుండా పోయిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాట్టి శ్రీరాములు నగర్‌కు చెందిన భాగ్యలత కుమార్తె 13 సంవత్సరాల కె.ప్రణవికి మతిస్థిమితం లేదు. సోమవారం ప్రణవి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం వెతికి కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని తల్లి భాగ్యలత సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

30 మద్యం బాటిళ్లు పట్టివేత



మంగళగిరి: దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు వద్ద 30 మద్యం బాటిళ్లను రూరల్ పోలీసులు పట్టుకున్నారు. సోమవారం రూరల్ ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల మేరకు విజయవాడకు చెందిన కె.రవీంద్ర, బీటా సాయి, దూది వరుణ్‌కుమార్‌లు కారులో విజయవాడ నుంచి తెనాలి మద్యం బాటిళ్లు తరలిస్తుండగా దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద తనిఖీ నిర్వహించి స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పార్శిల్ కార్యాలయాలలో తనిఖీలు..
పట్టణంలో ఆటోనగర్‌లోని పలు పార్శిల్ కార్యాలయాలలో పట్టణ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సీఐ శ్రీనివాసరావు తనిఖీలు నిర్వహించిన అనంతరం మాట్లాడుతూ పార్శిల్ కార్యాలయాలలో ఏవైనా అనుమానస్పదంగా పార్శిల్ వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఏవైనా పెద్ద సంఖ్యలో ఇంటి సామాగ్రి, చీరలు, మిక్సీలు లాంటి పార్శిల్‌లో వస్తే తమ దృష్టికి తీసుకురావాలని పార్శిల్ కార్యాలయాల నిర్వాహకులను ఆదేశించినట్లు తెలిపారు.

ఎన్నికల ఏర్పాట్లు వేగవంతం

నగర కమిషనర్, తూర్పు ఆర్వో కీర్తి చేకూరి



అధికారులకు సూచనలిస్తున్న నగర కమిషనర్, తూర్పు ఆర్వో కీర్తి చేకూరి

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను వేగంగా చేపట్టాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై సోమవారం కమిషనర్ చాంబర్‌లో ఆయా విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను తరలించడానికి రూట్ ఆఫీసర్లతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన వాహనాలను ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో మౌలిక వసతులు, ఇతర ఏర్పాట్లను వేగంగా పూర్తి చేసేలా ఏఆర్‌ఓలు పర్యవేక్షణ చేయాలని, క్షేత్రస్థాయిలో ఏ సమస్య ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎన్నికల విధుల్లో ఉండే ప్రభుత్వ ఉద్యోగులు వినియోగించుకునే పోస్టల్ బ్యాలెట్‌కు అధికారులు, సిబ్బందిని కేటాయించాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు మరింత విస్తృతంగా పర్యటిస్తూ, క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేయటం, అనుమతి లేని ప్రచార సామగ్రి, వాహనాలు సీజ్ చేయాలన్నారు. ఎన్నిక నియమావళి ఉల్లంఘించే వారిపై ఎఫ్ఐఆర్‌లు ఫైల్ చేయడంలో పోలీస్ శాఖతో సమన్వయం చేసుకొని జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఏఆర్‌ఓలను ఆదేశించారు. ఈ సమావేశంలో సెక్టోరల్ అధికారి శ్రీధర్, ఏఆర్‌ఓలు సునీల్, భీమరాజు, డిప్యూటీ కమిషనర్ వెంకట కృష్ణయ్య, ఈఈ సుందర్రామి రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూముల్లో తగిన ఏర్పాట్లు చేయాలి..
సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈవీఎంల కమిషనింగ్, పంపిణీ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల్లో తగిన ఏర్పాట్లు తక్షణం చేపట్టాలని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్, పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ) కె. రాజ్యలక్ష్మి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక లాడ్జ్ సెంటర్‌లోని ఏఎల్ బీఈడీ కాలేజీలోని మీటింగ్ హాల్స్, తరగతి గదులను ఈవీఎంల కమిషనింగ్, పంపిణీ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల కోసం అధికారులతో కలిసి అదనపు కమిషనర్ పరిశీలించి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గంలో వినియోగించే ఈవీఎంలు, వీవీప్యాట్‌ల కమిషనింగ్, స్ట్రాంగ్ రూమ్, పంపిణీ కేంద్రాలను స్థానిక బీఈడీ కాలేజీలో ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈవీఎంలను భద్ర పరిచే స్ట్రాంగ్ రూమ్‌లను ఆయా విభాగాల ఉన్నతాధికారులు, ఏఆర్‌ఓలు ప్రత్యక్ష పరిశీలన చేయాలని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి కమిషనింగ్ కేంద్రానికి అసెంబ్లీ, పార్లమెంటు ఈవీఎంలను వేరుగా తెచ్చేలా బ్యారికేడింగ్ చేపట్టాలని, అవసరమైన విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఏఆర్‌ఓలు సి.హెచ్.శ్రీనివాస్, సీనా రెడ్డి, నిరంజన్, కుమార్, ఏ.ఈ.ఆర్.ఓ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ సాంబశివరావు, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల ఆహారంతో రుచి, ఆరోగ్యం



చిరుధాన్యాలతో వంటల తయారీని వివరిస్తున్న హైమాకిరణ్

గుంటూరు రూరల్: చిరు ధాన్యాలతో తయారు చేసిన వంటకాలతో రుచి, ఆరోగ్యం కలుగుతుందని చిరు ధాన్యాల వంటకాల నిపుణులు హైమా కిరణ్ తెలిపారు. సోమవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతు నేస్తం ఫౌండేషన్‌లో చిరుధాన్యాలతో వంటకాల తయారీపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రస్తుత ప్రపంచంలో వివిధ రకాల కారణాల వల్ల సాంప్రదాయ ఆహారం చిరు ధాన్యాలను పక్కనబెట్టి వరి, గోధుమలు వాటి స్థానం వచ్చి చేరాయన్నారు. చిరుధాన్యాలతో పోల్చుకుంటే వరి, గోధుమల్లో పోషకాలు తక్కువగా ఉంటాయన్నారు. ఆరోగ్యంగా జీవించడానికి అవసరమైన పోషకాలు చిరుధాన్యాల్లోనే సమపాళ్లలో ఉంటాయని తెలిపారు. చిరుధాన్యాలతో ఇంట్లోనే తయారు చేయగలిగే వంటకాలు మిల్లెట్ కొబ్బరి అన్నం, మిల్లెట్ బిర్యాని, పులిహోర మసాలా, మిల్లెట్ పులిహోర, మిల్లెట్ పొంగల్, మిల్లెట్ ఉప్మా, మిల్లెట్ ఇడ్లీ, మిల్లెట్ దోశ, మిల్లెట్ సూప్ లాంటి వంటకాలను ప్రత్యక్షంగా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో అనురాధ, చిరుధాన్యాల నిపుణులు మిల్లెట్ రాంబాబు, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుది కుల దురహంకార మనస్తత్వం

ఆంధ్రప్రదేశ్ నెడ్ క్యాప్ కార్పొరేషన్ చైర్మన్ వేల్పుల రవికుమార్



తాడేపల్లిరూరల్: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కుల దురహంకార, భూస్వామ్య, నీచ మనస్తత్వం కలిగిన వ్యక్తి అని ఆంధ్రప్రదేశ్ నెడ్ క్యాప్ కార్పొరేషన్ చైర్మన్ వేల్పుల రవికుమార్ అన్నారు. సోమవారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లిలో ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవికుమార్ మాట్లాడుతూ చంద్రబాబుకు ఎస్సీ, ఎస్టీలు, నిరుపేదల పట్ల, వివిధ వృత్తులు చేసుకుని గౌరవంగా బ్రతికే శ్రామికుల పట్ల అత్యంత చులకన భావం ఉందని విమర్శించారు. ఉన్నత విద్యాధికుడైన సింగనమల అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఎం.వీరాంజనేయులను ఉద్దేశించి టిప్పర్ (లారీ) డ్రైవర్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీ సీటు ఇచ్చారని అత్యంత వ్యంగంగా, హేళనగా మాట్లాడారని తప్పుపట్టారు. వీరాంజనేయులు ఉన్నత విద్యాధికుడని, ఉద్యోగం దొరకకపోవడంతో టిప్పర్ డ్రైవర్‌గా నిజాయితీగా తన కుటుంబాన్ని పోషిస్తూ గౌరవంగా జీవిస్తున్నాడని అన్నారు. చంద్రబాబు నాయుడు దృష్టికలో టిప్పర్ డ్రైవర్లు, కారు డ్రైవర్లు, వివిధ వాహనాల డ్రైవర్లు మనుషులు కారా అని ప్రశ్నిస్తున్నా మన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదల పాలిట ఆత్మబంధువు అని, సామాన్యులను సైతం గెలిపించి పార్లమెంట్‌కు, అసెంబ్లీకి పంపగలరని అన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు ఎస్సీలలో పుట్టాలని ఎవరు కోరుకుంటారని సభ్య సమాజం సిగ్గుపడే వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు.

తాడికొండ చెక్‌పోస్టులో రూ.1.24లక్షలు స్వాధీనం

తాడికొండ: తాడికొండ అడ్డరోడ్డు చెక్‌పోస్టులో తనిఖీలు నిర్వహిస్తుండగా నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న రూ.1,24,320 నగదును పట్టుకున్నారు. అమరావతి మండలం లేమల్లె గ్రామానికి చెందిన షేక్ షరీఫ్ అనే వ్యక్తి బైక్‌లో నగదు పెట్టుకొని వెళుతుండగా పోలీసులు పట్టుకొని విచారించగా ఎలాంటి రశీదులు చూపించలేదు. దీంతో ఫ్లైయింగ్ స్క్వాడ్ సహాయంతో ఐటీ అధికారులకు అప్పగించనున్నట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు.

రాజకీయ కక్షతో పెన్షన్లు అడ్డుకోవడం సిగ్గుచేటు

నెహ్రూనగర్: రాజకీయ కక్ష సాధింపుతోనే ప్రభుత్వం 1వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అవ్వతాతలకు అందించే సామాజిక పెన్షన్లను చంద్రబాబు అడ్డుకోవడం అవివేకమని ఇటువంటి కుటిల రాజకీయాలు చేసే చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పేందుకు రాష్ట్ర ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా మాజీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం రాజేంద్రనగర్‌లోని ఆయన కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అవ్వతాతలు, దివ్యాంగులను ఇబ్బందులకు గురి చేయకూడదని, ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగనీయకుండా, వారి సంక్షేమం కోసం ఆలోచించి వలంటీర్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువస్తే ఈ విధానంపై కక్ష పెంచుకున్న చంద్రబాబు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి పెన్షన్లను నిలుపుదల చేయించడం బాధాకరమన్నారు. ఈ మండుటెండల్లో పెన్షన్ల కోసం సచివాలయాల వద్దకు వెళ్లనున్న వృద్ధులకు ఎటువంటి ప్రమాదం జరిగిన దానికి చంద్రబాబే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

ఉపాధ్యాయ వృత్తి భగవంతుని వరం



జుబేదాబేగం దంపతులను సత్కరిస్తున్న అతిథులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి భగవంతుడు ఇచ్చిన గొప్ప వరమని ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ గొల్లమూడి రాజసుందర్ బాబు పేర్కొన్నారు. చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో సీనియర్ ఉపాధ్యాయిని జుబేదా బేగం ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా సోమవారం పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది సంయుక్తంగా అభినందన సభ నిర్వహించారు.
ఈసందర్భంగా రాజ సుందర్‌బాబు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో 40 ఏళ్లపాటు సేవలందించడం సామాన్యమైన విషయం కాదన్నారు. పని చేసిన ప్రతి పాఠశాలలోనూ విద్యార్థుల విద్యాభివృద్ధి ధ్యేయంగా నిబద్ధతతో పని చేసిన జుబేదా బేగంను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు జీవితాంతం గుర్తుంచుకుంటారని అన్నారు. ఉర్దూ డీఐ షేక్ మొహమ్మద్ ఖాసిం మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయులందరికీ ఆదర్శంగా నిలిచిన జుబేదా బేగం పాఠశాల అభివృద్ధి కోసం ఎన్నో సేవలు చేశారని కొనియాడారు. ప్రధానోపాధ్యాయులరాలు బి.విజయలక్ష్మి, బోయపాలెం డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సుభాని, విశ్రాంత ఉర్దూ డీఐ ఖైరున్నీసా, ఇంజినీర్ పీఎస్ షరీఫ్, ప్రకాశం జిల్లా చేనేత, జౌళిశాఖ డిప్యూటీ డైరెక్టర్ బడుగు ఉదయ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మహిళను బ్లాక్‌మెయిల్ చేస్తున్న వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: మహిళను బ్లాక్‌మెయిల్ చేస్తున్న వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అమరావతి రోడ్డు హిందూ కళాశాల సమీపంలో నివాసం ఉండే మహిళ విజయవాడకు చెందిన జాషుతో గతంలో సహజీవనం చేసింది. అయితే జాషు ప్రస్తుతం మహిళను కొన్ని ఫొటోలు చూపించి బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బకింగ్‌హామ్ కెనాల్‌లో గుర్తుతెలియని మృతదేహం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని మోరంపూడి భారత్ పెట్రోల్ బంక్ ఎదురుగా బకింగ్‌హామ్ కెనాల్‌లో మృతదేహం ఉన్నట్లు స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ మహేంద్ర సోమవారం సంఘటనా స్థలానికి వెళ్లి ముళ్లపొదల్లో ఇరుక్కుపోయి ఎముకలు బయటపడిన మృతదేహాన్ని బయటకు తీయించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహేంద్ర మాట్లాడుతూ మృతిచెందిన వ్యక్తి వయస్సు 50–60 సంవత్సరాలు ఉండవచ్చని, ఎప్పుడు బకింగ్ హామ్ కెనాల్‌లో కొట్టుకు వచ్చి ముళ్లపొదల్లో ఇరుక్కుపోయి మృతదేహం కుళ్లిపోయి ఎముకలు బయటపడ్డాయని, మృతుని వంటిపై బ్లూ, ఎరుపు రంగు కలిగిన షర్ట్, బ్లూ కలర్ ఫ్యాంట్ ఉన్నాయని, మోరంపూడి వీఆర్‌ఓ దేవరపల్లి రత్నకుమారి సమక్షంలో గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేంద్ర తెలిపారు.

ఉపవాస దీక్షాపరులకు ఖీర్ పంపిణీ



గుంటూరు మెడికల్: పవిత్ర రంజాన్‌మాసంలో ఉపవాస దీక్ష చేస్తున్న ముస్లింలకు కనీసం ఖర్జూరు పండు అందజేసి ఉపవాస దీక్ష విరమింప చేయిస్తే ఎంతో పుణ్యం వస్తుందని హోప్‌విన్ హాస్పటల్స్ అధినేత, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమా సుల్తానా, చైర్మన్, ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నజీరుద్దీన్ అన్నారు. హాస్పటల్ ఆధ్వర్యంలో వైద్యులు స్వయంగా తయారు చేసి సుమారు 500 మంది ఉపవాస దీక్షా పరులకు మసీదుల్లో ఖర్జూరా, ఖీర్ ఖుర్మా పంపిణీ చేసినట్లు వెల్లడించారు.

8న భక్తాంజనేయస్వామి తిరునాళ్ల

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామ శివారులోని గరువు కొండ వద్దనున్న భక్తాంజనేయస్వామి 14వ తిరునాళ్ల ఈనెల 8వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయఅభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ఆదేరోజు సాయంత్రం తిరునాళ్ల సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి గ్రామోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. 9వతేదీన ఉగాది పండుగనాడు స్వామివారికి నాగవల్లీ దళాలతో అష్టోత్తర, సహస్రనామ పూజలను అర్చకులు నిర్వహిస్తారన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం ఉంటుందని తెలిపారు.

మూడు గ్రామాల్లో పోలీసు కవాతు

ఫిరంగిపురం: ప్రజలు తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని సీఐ వీరేంద్రబాబు అన్నారు. మండలంలోని మేరికపూడి, పొనుగుపాడు, మునగపాడు గ్రామాల్లో సోమవారం ప్రత్యేక పోలీసు బలగాలతో పోలీసు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటును వినియోగించుకోవాలని చెప్పారు.

శివనామ స్మరణతో మనసు పవిత్రం

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- సంపత్ నగర్ శివాలయంలో ప్రత్యేక పూజలు



అర్చకుల నుంచి ఆశీర్వాదం పొందుతున్న మంత్రి రజిని

పట్నంబజారు: ముల్లోకాల అధిపతి మహాదేవుడు.. ఆయన్ని నిండు మనస్సుతో స్మరిస్తే.. అంతా మంచే జరుగుతుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. గుంటూరు నగరంలోని సంపత్‌నగర్ శివాలయంలో సోమవారం మహారుద్రాభిషేకం పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ ఆదిదేవుడు మహాశివుడు అంటే కల్మషం లేనివాడని, అందుకే ఆయన్ను భోళా శంకరుడు అంటారని, శివనామస్మరణతో మనసు పరిశుద్ధం అవుతుందన్నారు. సర్వేశ్వరుడు ప్రకృతిలోని సత్వ, తమో, రజో గుణాలేవీ అంటనివాడని, అందుకే శివనామస్మరణ చేస్తే మనస్సుల్లోని కల్మషం అంతా పోయి పరిశుద్ధులం అవుతామన్నారు. భస్మం పరిశుభ్రతను.. ముక్కంటి మూడో నేత్రం జ్ఞానానికి సూచిక అని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నిమ్మల వెంకటరమణ, గేదెల రమేష్, టెంట్ హౌస్ బాబు, గుంటూరు వెస్ట్ సోషల్ మీడియా కన్వీనర్ యద్దనపల్లి బాలరాజు, శ్రీనివాస్ రెడ్డి, బొబ్బిలి శ్రీను, కొమ్మేర రాము, మల్లికార్జున్, ఐటీసీ రవి, వాసు, నందిరాజు మీనాక్షి, గనిక ఝాన్సీ, సుజాత, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

సీటీఎస్ వార్డులో రూ. 60 లక్షలతో వర్క్‌స్టేషన్



వర్క్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి కార్డియో థొరాసిక్ సర్జరీ (సీటీఎస్) వార్డు ఆపరేషన్ థియేటర్‌లో ఆధునాతమైన ఎల్ఈడీ లైట్లు, వర్క్ స్టేషన్ రూ. 60 లక్షలతో ఏర్పాటు చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. సోమవారం సీటీఎస్ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లను ఆయన ప్రారంభించారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ గతంలో రెండు ఆపరేషన్ థియేటర్లలో వెలుతురూ సరిగా లేకపోవడంతో వైద్యులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. వైద్యుల అవసరాలను గుర్తించి వెంటనే విద్యుత్ లైట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనివల్ల శస్త్ర చికిత్సలు చేయడం చాలా తేలికగా ఉండటమే కాకుండా వైద్యులకు ఎలాంటి అలసట లేకుండా ఉంటుందన్నారు. ఆపరేటషన్ థియేటర్‌లో వీడియో మానిటరింగ్ కూడా ఏర్పాటు చేశామన్నారు. దీని ద్వారా వైద్య విద్యార్థులు వృత్తి మెలకువలు నేర్చుకోవడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్పొరేట్ ఆసుపత్రిలో కూడా లేనివిధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో అధునాతమైన లైట్లు ఏర్పాటు చేశామన్నారు. బైపాస్ హార్ట్ సర్జరీలు సుఖవుగా చేసేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. రెండు ఆపరేషన్ థియేటర్ అందుబాటులో ఉండటం వల్ల ప్రతిరోజూ రెండు ఆపరేషన్‌లు చేసే అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. త్వరలో రెండవ ఆపరేషన్ గదిలో ఫ్లోరింగ్, రూ. 20 లక్షల విలువైన ఆధునిక లైట్లు ఏర్పాటు చేస్తామని, రూ. 80 లక్షల విలువైన టి.ఇ.ఇ స్కాన్ ప్రోబ్ కూడా అందుబాటులోకి తెస్తామన్నారు. సీటీఎస్ వైద్యులు కుప్ప స్వామి, రామరాజు, పోలయ్య, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ సతీష్ కుమార్, డెప్యూటీ కలెక్టర్ సుధా రాణి, ఏడీ నాగేశ్వర రావు, నర్సింగ్ సూపరింటెండెంట్లు ఆషా సజని, గంగమ్మ పాల్గొన్నారు.

చంద్రబాబుది పెత్తందారీ మనస్తత్వం



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ సంతోష్, పక్కన ఆటోడ్రైవర్లు

పట్నంబజారు: దళితులంటే చంద్రబాబుకు ఎందుకంత అక్కసో చెప్పాలని 31వ డివిజన్ కార్పొరేటర్ అందుగుల సంతోష్ అన్నారు. చంద్రమౌళి నగర్‌లోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆటోడ్రైవర్ల యూనియన్ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టిప్పర్ డ్రైవర్‌కు ఎమ్మెల్యే టికెట్టు ఇవ్వకూడదా అని ప్రశ్నించారు. పేదవారికి టికెట్టు ఇస్తే.. హేళన చేస్తూ మాట్లాడటం చంద్రబాబునాయుడికే చెల్లిందని, ఆయనది పెత్తందారి స్వభావమని మండిపడ్డారు. పేదలంటే ఆయనకు చులకనభావం అని దుయ్యబట్టారు. చంద్రబాబు చేయలేని పనిని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపిస్తున్నారని తెలిపారు. పేదలకు, డ్రైవర్లకు అసెంబ్లీ, పార్లమెంటు టికెట్లు ఇస్తూ రాజకీయాల్లో ఆదర్శంగా నిలుస్తున్న నాయకుడు జగనన్న అని కొనియాడారు. ఎస్సీలుగా ఎవరైనా పుట్టాలని అనుకుంటారా అంటూ ఎస్సీల మనోభావాలను చంద్రబాబు దెబ్బతీశారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి గతంలో వచ్చిన 23 సీట్లు కూడా వచ్చే పరిస్థితి లేదని విమర్శించారు. గుంటూరు నగర ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు మురళి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రతి ఆటోడ్రైవర్, ప్రతి కార్మికుడు టీడీపీకి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆటోడ్రైవర్లను హింసించిన చరిత్ర చంద్రబాబుదని, డ్రైవర్లపై కేసులు పెట్టి వేధించిన నీచ చరిత్ర టీడీపీదని ఆరోపించారు. యూనియన్ నాయకులు డి.లక్ష్మీ నారాయణ, రమణారెడ్డి, లక్ష్మయ్య, మల్లికార్జున్, రమణ, కొండలు, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

మెడ్‌ప్లస్‌లో ఉద్యోగాలకు 16 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ ప్రభాకరరావు, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో ఇటీవల మెడ్‌ప్లస్ ఫార్మసీ మార్ట్ నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో కళాశాలకు చెందిన 16 మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకరరావు తెలిపారు. సోమవారం కళాశాలలో జరిగిన విద్యార్థినుల అభినందన కార్యక్రమంలో ప్రభాకరరావు మాట్లాడుతూ ఔషధ రంగంలో వృత్తి నైపుణ్యం సాధించడం ద్వారా విద్యార్థినులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. విద్యలో చూపిన ప్రతిభతో పాటు విద్యార్థినుల్లోని నైపుణ్యాల ఆధారంగా మెడ్‌ప్లస్ ప్రతినిధులు తమ సంస్థలో ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు వివరించారు. జీవితంలో త్వరగా స్థిరపడేందుకు పాలిటెక్నిక్ కోర్సులు దోహదం చేస్తాయని, ఇంటర్మీడియెట్ ఎంపీసీ, బైపీసీ, దూరవిద్య ఇంటర్ చదివిన విద్యార్థినులు పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరవచ్చునని తెలిపారు. గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో విద్యార్థినులకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

దళితులపై చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ విభాగం నేతలు

పట్నంబజారు: దళితులపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎస్సీ విభాగం నేతలు డిమాండ్ చేశారు. ఈమేరకు బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టిప్పర్ డ్రైవర్‌ను అసెంబ్లీకి పంపాలని కోరడమే రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తప్పా అని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్.. చంద్రబాబు మాదిరిగా కోట్లాది రూపాయలు డబ్బులు తీసుకుని చట్ట సభలకు ధనికులను పంపడం లేదన్నారు. గతంలో కూడా చంద్రబాబు దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఎస్సీల్లో పుట్టాలని ఎవరు కోరుకుంటారని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు చంద్రబాబుకు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. అగ్గిపెట్టి రాజు, మనోరంజని, చిలుకా రమేష్, రవిరాజు, సాల్మాన్, మహేష్, అంకాల రాజు, పెదబాబు, జంగం దాసు, రాజేష్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.